సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 18 । జులై । 2025



స్వల్పంగా వచ్చే వరద మంచిదే!

స్వల్పంగా వచ్చే వరదకు రైతులు, లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేవారు, మత్స్యకారులు సంబర పడతారంటే అతిశయోక్తి కాదు.

8లో



రూ.2.12 లక్షల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ రూ.2,11,999 విరాళం అందజేశారు.

36వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 36,154 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద గురువారం సాయంత్రం 10.90 అడుగులకు నీటి మట్టం చేరింది. డెల్టా కాలువలకు సంబంధించి 14,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం



ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రాజు

కొత్తపేట: జిల్లాలోని 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు స్థానిక వీకేవీ ప్రభుత్వ ఐడెంటిఫైడ్ (ఐడీ) డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం జోన్ – 2, జిల్లా పరిధిలోని 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న అధ్యాపకుల రెన్యువల్‌కు ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్‌కు దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ఆ దరఖాస్తులను 20వ తేదీన కొత్తపేట ఐడీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాలని తెలిపారు. 21 నుంచి 23 తేదీ లోపు రెన్యువల్ కోసం జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి వుంటుందని పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి రెన్యువల్ అయిన ఒప్పంద అధ్యాపకులు కౌన్సిలింగ్ ముగిసిన తరువాత రోజు అగ్రిమెంట్ పత్రాలను కళాశాల ప్రిన్సిపాల్స్‌కు అందచేసి, అగ్రిమెంట్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

బంగారు కుటుంబాలను ఆదుకోవాలి

ధనవంతులకు కలెక్టర్ పిలుపు




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: పేదరికం లేని సమాజం కోసం జిల్లాలో 64 వేల బంగారు కుటుంబాల పేదలను పైకి తీసుకువచ్చేందుకు ధనవంతులు ముందుకు రావాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం అమరావతి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్వర్ణాంధ్ర, పీ–4 తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు మద్దతుగా నిలవాలన్నారు. జిల్లాలో ఇంత వరకు 64 వేల మంది బంగారు కుటుంబాలను గుర్తించామని, వారికి మార్గదర్శకులు అండగా నిలవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరించాలి

కేంద్ర మంత్రికి కేఆర్‌ఎస్ఎస్ బృందం వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న కేఆర్‌ఎస్ఎస్ ప్రతినిధి సూర్యనారాయణరావు, ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణంలోని మున్సిపల్ సర్క్యులర్ బజార్ (షాపింగ్ కాంపెక్స్)లో గతంలో కొనసాగినట్లే రైల్వే టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్‌ఎస్ఎస్) ప్రతినిధుల బృందం వినతి పత్రం అందజేసింది. రాజోలులోని నూతన పోస్ట్ ఆఫీస్ భవనాన్ని ప్రారంభించేందుకు ఈ ప్రాంతానికి వచ్చిన కేంద్ర మంత్రిని ఆ బృందం కలిసి రైల్వే కౌంటర్ పునరుద్ధరణపై చర్చించింది. అమలాపురంలో రిజర్వేషన్ కౌంటర్‌ను 2023లో మూసివేశారని వారు వివరించారు. కేఆర్‌ఎస్ఎస్ ప్రతినిధి, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కూడా కేంద్ర మంత్రికి అమలాపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను మున్సిపల్ షాపుల్లోంచి ఎత్తివేసిన తర్వాత కోనసీమ ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. కేఆర్‌ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, కేఆర్‌ఎస్ఎస్ ప్రతినిధులు కల్వకొలను తాతాజీ, ఉప్పుగంటి భాస్కరరావు, పోలిశెట్టి శివాజీ, ఎరగర్త వెంకటేశ్వరరావు తదితరులు కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

అశక్తతా.. ఆగ్రహమా?

సహనానికి నిలువెత్తు రూపం భూదేవి. అదే లక్షణాన్ని పుణికిపుచ్చుకున్నాడో ఏమో పుడమిపుత్రుడు ఎంత కష్టం ఎదురైనా.. ఎంత నష్టం చవిచూస్తున్నా నాగలి చేతపట్టి నా బొందో అనుకుంటూ అతడిని నమ్ముకున్న జనం ఆకలి తీర్చడానికి శత విధాల కృషి చేస్తుంటాడు. అయినప్పటికీ అతనికి కనీస సహకారం లభించని పరిస్థితులు ఎదురైతే కాడి వదిలేయడం తప్ప ఆయన చేసేదేమీ ఉండదు. కాలం కలసిరావాలి.. వరుణుడు కరుణించాలి.. ప్రభుత్వాలు సహకరించాలి.. ఇవన్నీ సకాలంలో సహకరిస్తేనే అతను పునరుత్తేజం పొంది ప్రజలకు నాలుగు మెతుకులు పెట్టగలడు. కాలం.. వరుణుడి కరుణ పక్కన పెడితే ప్రభుత్వ సహకారం చేతిలో ఉన్నదే. అన్నదాతను విస్మరించిన ప్రభుత్వం మనలేదన్నది చారిత్రక సత్యం. అన్నదాత ముందుకు సాగాలంటే ప్రభుత్వం చేదోడుగా నిలవాల్సిందే. ఇవేమీ చేయకపోయినా అన్నదాత కొట్టడు.. తిట్టడు.. ఆగ్రహించడు. అవి ప్రదర్శించినా అతనికి జరిగే న్యాయం అంతంతే. అతడు కేవలం కినుక వహిస్తే చాలు. మౌనం దాలిస్తే చాలదా..? ఆ తరువాత కాగల కార్యం గంధర్వులే చేస్తారు.

- ఆరు మండలాల్లో నాట్లు శూన్యం
- జిల్లాలో సాగని ఖరీఫ్ పనులు
- 29 శాతం నాట్లు మాత్రమే పూర్తి
- మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో కేవలం 1,100 ఎకరాల్లోనే నారుమడులు
- మూడు పంటలు పండే డెల్టాలో ఎన్నడూ లేని దైన్యం
- భరోసా లేక సాగుకు ఆసక్తి చూపని అన్నదాత

సాక్షి, అమలాపురం: ఏడాదికి మూడు పంటలు పండే గోదావరి డెల్టాలో ఖరీఫ్ తొలకరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. జులై మూడో వారంలోకి ప్రవేశిస్తున్నా సగం ఆయకట్టు ప్రాంతాల్లో కూడా నాట్లు పడలేదు. శివారులో అయితే పరిస్థితి మరీ దారుణం. గడిచిన దశాబ్ద కాలంగా డెల్టా శివారుల్లో ఏటా ఐదారు వేల ఎకరాల్లో రైతులు సాగు చేయక పోవడం పరిపాటే. కాని ఈ ఏడాది దుస్థితి గతంలో ఎన్నడూ లేనంతగా తయారైంది. జిల్లాలో 22 మండలాల్లో ఏకంగా ఆరు మండలాల్లో ఇప్పటి వరకు ఒక్క ఎకరాలో కూడా వరినాట్లు పడలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ఖరీఫ్ అంచనా 1,63,399 ఎకరాలు కాగా, బుధవారం వరకు 47,843 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. రాజోలు దీవిలో మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల్లో నాట్లు పడలేదు. రాజోలు మండలంలో 26 ఎకరాల్లోనూ, పి.గన్నవరంలో 93 ఎకరాలు, అంబాజీపేటలో 126 ఎకరాలు, అమలాపురంలో 145 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. ముమ్మిడివరం 225, ఐ.పోలవరం 249, కె.గంగవరం 389, అయినవిల్లిలో 605 ఎకరాలో చొప్పున వెయ్యి ఎకరాల కన్నా తక్కువ నాట్లు వేశారు.



కాట్రేనికోన మండలం కొప్పిగుంటలో సాగు లేక ఖాళీగా ఉన్న పంటభూమి



అల్లవరం మండలం కొమరిగిరిపట్నంలో దుస్థితి ఇదీ..

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



సఖినేటిపల్లి మండలం ఉయ్యూరివారిమెరక నక్కల పర్రలో బీడువారిన సాగుభూమి

ఇలా అయితే పంట పండించేలేం



గతంలో నాలుగు ఎకరాలు సాగు చేసేవాడిని. ఇప్పుడు పరిస్థితులు అనుకూలంగా లేక రెండెకరాలలో పంట పండించేవాడిని. ఈ ఏడాది తొలకరి మొత్తం మానేశాను. ముంపునీరు దిగేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్య పరిష్కరించకుంటే నాతో పాటు మా రైతులు ఎవరూ సాగు చేసే అవకాశం లేదు.

– అంతర్వేదిపాలెం వెంకటేశ్వర్లు, కౌలురైతు, ఉయ్యూరివారిమెరక, సకినేటిపల్లి మండలం.

ముఖం చాటేస్తున్న ప్రభుత్వం

శివారుల్లో రైతులు సాగు చేయడానికి ఏటా వెనకాడుతూనే ఉన్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా మారడంతో ఇక్కడ వరిసాగు అస్తవ్యస్తంగా మారిపోయింది. ఈ ఏడాది మరీ దారుణమైన పరిస్థితి. ధాన్యం సొమ్ములు సకాలంలో ఇవ్వకుండా రైతులను కూటమి ప్రభుత్వం ముప్పు తిప్పలు పెట్టింది. అన్నదాత సుఖీభవ సొమ్ములు ఒక ఏడాది ఎగ్గొట్టిన ప్రభుత్వం రెండో ఏడాది సొమ్ములు ఏప్రిల్, మే నెలలో వేస్తామని మోసం చేశారు. ఉచిత పంటల బీమా ఎత్తివేసింది. పంట నష్టపోతే పరిహారం ఇస్తారనే నమ్మకం రైతులకు కలగడం లేదు. దీనికి తోడు ఈ ఏడాది లోటు వర్షం. ఇదీ అన్నదాత వెనుకబాటుకు కారణం.

కనికరించని వరుణుడు.. శివార్లకు సాగని నీరు..

గోదావరి డెల్టాలోని శివారుల్లో ఖరీఫ్ సాగు జూదంగా మారింది. కొద్దిపాటి వర్షానికే చేలు మునుగుతున్నాయని రైతులు సాగుకు దూరమవుతున్నారు. అటువంటిది ఇప్పుడు ఒకవైపు వర్షాలు లేకపోగా.. మరోవైపు శివారుకు సాగునీరందకపోవడం మరీ ఇబ్బందికరమైన పరిస్థితి. దీనితో రైతులు మోటార్ల నుంచి నీరు తోడుకుని నారుమడులు రక్షించుకుంటున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో కాట్రేనికోన మండలం శివారులో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ఈ మండలం పల్లంకుర్రు ఆయకట్టు పరిధిలో రైతులు దమ్ములు చేద్దామంటే నీరందడం లేదు. మొదటి దమ్ములు చేసిన భూములకు రెండోసారి దమ్ములు చేసేందుకు నీరందడం లేదు. మధ్య డెల్టాకు 2,600 క్యూసెక్కుల నీరు వదలడం అంటే మాటలు కాదు. పంట కాలువలకు 70 డ్యూటీ చొప్పున (ఒక క్యూసెక్కు 70 ఎకరాలకు) ఇస్తున్నారు. అయినా శివారుకు సాగు నీరు అందడం లేదు. దీంతో మోటార్లతో రైతులు నీరు తోడుకోవాల్సి వస్తోంది. పల్లంకుర్రు ప్రధాన కాలువ మీద సుమారు 20 వరకు ఇంజిన్లు పెట్టి రైతులు తమ పొలాలకు నీరు తోడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పంట కాలువ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో ఈ దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.



కాట్రేనికోన మండలం పల్లంకుర్రు వద్ద రెండో దుక్కుకు నీరందక నెర్రెలు తీసిన వరిచేలు

ఈ పరిస్థితి ఎప్పుడూ లేదు

తొలకరి పంట జూదంగా మారింది. అయినా ధైర్యం చేసి సాగు చేస్తున్నాం. కాని ఈసారి వర్షాలు లేవు, పంట కాలువల నుంచి నీరు రాకపోవడం మరీ విడ్డూరంగా ఉంది. ఇలాంటి దశలో సాగు ఎలా చేయాలో అర్థం కావడం లేదు. ఏటా 25 ఎకరాల వరకు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ఈ ఏడాదంత దుర్భరమైన పరిస్థితి ఎప్పుడు చూడలేదు. నారుమడులను కాపాడుకునేందుకు ఇంజిన్లతో నీరు తోడుకోవాల్సి రావడం తొలకరిలో ఇదే మొదటసారి.

– పులుగు దశరథ రామయ్య, కౌలు రైతు, పల్లంకుర్రు, కాట్రేనికోన మండలం

నానాటికీ తీసికట్టు

రాజోలు దీవిలో తొలకరి సాగు మరీ దారుణంగా మారింది. సఖినేటిపల్లి, మలికిపురం, మామిడికుదురు మండలాల్లో ఇంకా నాట్లు పడలేదు సరి కదా, సఖినేటిపల్లిలో ఇంత వరకు కేవలం 335 ఎకరాల్లోనూ, మలికిపురం మండలంలో 739 ఎకరాల్లో నారు వేయడం గమనార్హం. శివారు మండలాల్లో సాగు నత్తనడకన సాగుతోంది. నాలుగు మండలాల్లో కలిపి సుమారు 20 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉండగా కేవలం 26 ఎకరాల్లో నాట్లు పడ్డాయంటే పరిస్థితి ఊహించుకోవచ్చు. సఖినేటిపల్లి మండలం మోరి సరిహద్దులో సాగు చేస్తున్న భూములకు మురుగునీటి సౌకర్యం లేక సార్వాకు రైతులు దూరమవుతున్నారు. ఆక్వా సాగు దారులు మురుగునీటి ప్రవాహం బోదెలను మూసివేస్తుండడంతో సార్వా సాగును రైతులు వదులు కుంటున్నారు.

తొలకరి వదిలేశాం



మోరి సరిహద్దులో మామిడితోట పంటకాలువను ఆనుకుని అంతర్వేదిపాలెంలో ఐదు ఎకరాలు సాగు చేస్తున్నాను. సార్వా సీజన్‌లో మురుగునీరు వెళ్లే మార్గం లేక ఏటా ఊడ్చడం మానేశాను. దాళ్వాకు కూడా రెండు ఎకరాలకు మించి ఊడ్చలేకపోతున్నా. ముంపు సమస్య పరిష్కరించక పోతే ఏటా ఇదే పరిస్థితి. అయినా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు.

– చెల్లుబోయిన సత్యనారాయణ, కౌలు రైతు, అంతర్వేదిపాలెం



సఖినేటిపల్లి మండలం మోరి వద్ద సాగుకు దూరమైన వరిచేను

మరిడమ్మ దర్శనానికి భారీగా భక్తులు



ఆలయంలో బారులు తీరిన భక్తులు

పెద్దాపురం: భక్తుల కల్పవల్లిగా ఖ్యాతికెక్కిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర ఘనంగా జరుగుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు గురువారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం వద్ద భారీ క్యూ లైన్లలో బారులు తీరి మరీ అమ్మవారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యాన సిబ్బంది చర్యలు చేపట్టారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. స్థానిక స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యాన భక్తులకు పులిహోర పంపిణీ చేశారు.

పిల్లలకు ఉచితంగా కంటి పరీక్షలు

- 19 ఏళ్ల లోపు పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి
- అమలాపురం డైస్ ఆధ్వర్యంలో సేవలు
- కంటి వైద్య నిపుణుడు దేవకుమార్



చిన్నారికి కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ దేవకుమార్

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలోని డైస్ ఆధ్వర్యంలో చిన్నారులకు కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. రూ.లక్షల వ్యయమయ్యే చికిత్సలను ఈ కేంద్రంలో ఉచితంగా చేస్తున్నట్టు కంటి వైద్య నిపుణుడు యు.దేవకుమార్ తెలిపారు. ప్రభుత్వం, పలువురు ఎన్జీవోలు, ఎన్జీవో సంస్థల సహకారంతో ఆర్‌వోపీ, కంటి శుక్లాలు, మెల్ల కన్ను, కంటి రెప్ప జారటం వంటి కంట సమస్యలకు ప్రయాణ ఖర్చులు కూడా లేకుండా శస్త్ర చికిత్సలు చేయడానికి డైస్ సెంటర్‌లో సదుపాయాలు ఉన్నాయని ఆయన తెలిపారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 19 ఏళ్ల పేద కుటుంబాల పిల్లలకు ఈ సెంటర్ అందిస్తున్న కంటి వైద్య సేవలను, చిన్న పిల్లల్లో వచ్చే కంటి సమస్యలను దేవకుమార్ వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ఈ సమాచారాన్ని అందరికీ తెలియజేసి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అమలాపురంలోని డైస్ కేంద్రం పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల మధ్య ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 94937 48918 ఫోన్ నంబరులో సంప్రదించాలని తెలిపారు.

నేడు ఆర్టీసీ ఎంప్లాయీస్ గ్రీవెన్స్ డే



రాఘవకుమార్

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నెల మూడో శుక్రవారం ఎంప్లాయీస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తునట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్ తెలిపారు. జిల్లాలోని అమలాపురం, రావులపాలెం, రామచంద్రపురం, రాజోలు డిపోల్లోని తమ రవాణా కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహిహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆర్టీసీలో వివిధ విభాగాల ఉద్యోగులు వృత్తి పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించి పరిష్కరించుకోవాలని రాఘవకుమార్ కోరారు.

పోలీస్ టెన్నిస్ కోర్టు ప్రారంభం

టెన్నిస్ ఆడిన కలెక్టర్, ఎస్పీ



టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ కృష్ణారావు తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక ఆర్డీవో కార్యాలయం సమీపంలోని పోలీస్ గ్రౌండ్స్ వద్ద నూతనంగా నిర్మించిన అశోక్ బ్లెస్సన్ టెన్నిస్ కోర్టును కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ బి.కృష్ణారావుతో సరదాగా కొద్దిసేపు టెన్నిస్ ఆడి అలరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధుల అనంతరం మానసిక ఆరోగ్య సాధనకు ఈ కోర్టు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో దేవి సీ ఫుడ్స్ సీఎండీ పి.బ్రహ్మానందం, ఏఎస్పీ ఏవీఎస్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఆర్మ్‌డ్ డీఎస్పీ సుబ్బరాజు, పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్‌బీ సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాసరావు, క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పై చదువులకు పగ్గాలు!

- డిగ్రీ ప్రవేశాలకు విడుదల కాని నోటిఫికేషన్
- రెండు నెలలుగా విద్యార్థుల నిరీక్షణ
- జాప్యమైతే ఇతర కోర్సులకు తరలిపోయే అవకాశం
- ప్రవేశాలు తగ్గితే డిగ్రీ కళాశాలల ఉనికికే ముప్పు



నన్నయ పరిధిలో కళాశాలలు ఇవీ..

రాయవరం: డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయడానికి ఉన్నత విద్యామండలి మీనమేషాలు లెక్కిస్తోంది. ఇంటర్మీడియెట్ ఫలితాలు వచ్చి రెండు నెలలైనా డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ రాకపోవడంతో విద్యార్థులలో అయోమయం నెలకొంది. ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరికకు కౌన్సెలింగ్ కూడా ప్రారంభించారు. అయినా డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ జాడ లేదు. అయినప్పటికీ అడ్మిషన్ల కోసం విద్యార్థులు కళాశాలలకు వెళ్లి సీట్లు, కోర్సులపై ఆరా తీస్తున్నారు. దీంతో కళాశాలల సిబ్బంది విద్యార్థుల పేర్లు, ఫోన్ నంబర్లు నమోదు చేసుకుని నోటిఫికేషన్ వచ్చాక కబురు చేస్తామని తిప్పి పంపుతున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనకు కమిటీ

50 కంటే తక్కువ అడ్మిషన్లు నమోదైన కళాశాలల్లో వాస్తవ పరిస్థితుల పరిశీలనకు ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక కమిటీలను నియమిస్తోంది. రెండేళ్లుగా 25 శాతం కంటే తక్కువగా అడ్మిషన్లు ఉన్న కళాశాలలను **క్షేత్రస్థాయిలో కమిటీ పరిశీలించి అడ్మిషన్లు తక్కువగా ఉండడానికి గల కారణాలపై ఆరా తీసి నివేదిక సమర్పించింది. ఆదికవి నన్నయ యూని**వర్సిటీ పరిధిలోని 60 కళాశాలల్లో 25 శాతం కన్నా తక్కువగా అడ్మిషన్లు నమోదైనట్లుగా గుర్తించారు.

జాప్యమైతే కళాశాలలకు ఇబ్బందే

2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది నిర్ణీత సమయంలో డిగ్రీ తరగతులు ప్రారంభమవుతాయని భావించినా నోటిఫికేషన్ విడుదల కాక విద్యార్థులకు నిరాశే మిగిలింది. ఈ జాప్యంతో విద్యార్థులు ఇతర కోర్సులు వైపు దృష్టి సారించే అవకాశం ఉంది. దానివల్ల డిగ్రీ కళాశాలలు సీట్ల భర్తీలో వెనుకబడే అవకాశముంది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి నోటిఫికేషన్ త్వరగా వెలవరించాలని కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

గతేడాది ఇదే పరిస్థితి

కోవిడ్ ప్రభావంతో ఆలస్యమైన డిగ్రీ ప్రవేశాలు అదే ఒరవడిని కొనసాగిస్తూ 2020 నుంచీ అక్టోబర్ నెలలో తరగతులు ప్రారంభించారు. కాగా గత ఏడాది ఆగస్టులోనే తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూలైలోనే తరగతులు మొదలవుతాయని ఆశ పడినా నేటి వరకు నోటిఫికేషన్ లేక పోవడం గమనార్హం.

నన్నయ వర్సిటీ పరిధిలో 171 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో ఆరు, కాకినాడ జిల్లాలో ఐదు, కోనసీమ జిల్లాలో ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో ఒకటి, కాకినాడ జిల్లాలో రెండు ప్రభుత్వ యాజమాన్యంలో అటానమస్ కళాశాలలుండగా, ప్రైవేట్ యాజమాన్య పరిధిలో కాకినాడ జిల్లాలో ఒకటి, కోనసీమ జిల్లాలో ఒకటి అటానమస్ డిగ్రీ కళాశాలలున్నాయి. ప్రైవేట్ యాజమాన్యం పరిధిలో తూర్పుగోదావరి జిల్లాలో ఒకటి, కాకినాడ జిల్లాలో రెండు ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అలాగే తూర్పుగోదావరి జిల్లాలో 39, కాకినాడ జిల్లాలో 44, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 45 అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలున్నాయి. అలాగే తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యంలో రెండు, ప్రైవేట్ యాజమాన్యంలో నాలుగు, కాకినాడ జిల్లాలో ప్రైవేట్ యాజమాన్యంలో ఏడు, కోనసీమ జిల్లాలో ప్రైవేట్ యాజమాన్య పరిధిలో నాలుగు మహిళా డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో అక్నూ పరిధిలో 32 వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు.

నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ విడుదలైన వెంటనే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తాం. ఆన్‌లైన్‌లో అభ్యర్థులు అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. త్వరలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎ.మట్టారెడ్డి, డీన్ ఆదికవి నన్నయ యూనివర్శిటీ, రాజానగరం.

అపజయాలే విజయ సోపానాలు

ట్రైనీ ఐఏఎస్ అధికారి బుద్ధి అఖిల్



సదస్సులో మాట్లాడుతున్న బుద్ధి అఖిల్

యానాం: ఐఏఎస్ సాధనలో ఎన్నో అపజయాలు చూసి చివరికి విజయం సాధించానని అందుకే అవినా విజయసోపానాలని ట్రైనీ ఐఏఎస్ అధికారి, మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన్‌భవన్‌లో యానాం, ఉమ్మడి తూర్పుగోదావరి, విజయనగరం, విశాఖపట్టణం తదితర ప్రాంతాల నుంచి యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించి పరీక్షకు ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం చదవాల్సిన పుస్తకాలపై అవగాహన కలిగించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

పెరవలి: మండలంలోని ఖండవల్లి వద్ద గురువారం తెల్లవారు జామున జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెల్పిన వివరాలిలా ఉన్నాయి. ఆచంట మండలం వల్లూరు గ్రామానికి చెందిన నార్కిమెల్లి వెంకటేశ్వరరావు (42) మెటల్ తీసుకురావటానికి ట్రాక్టర్‌పై బయలుదేరి ఖండవల్లి సెంటర్‌కు వచ్చాడు. అక్కడ వేగ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఐరన్ డ్రమ్ములను తప్పించబోయి సడన్ బ్రేక్ వేయటంతో రోడ్డుపై పడ్డాడు. ఆ సమయంలో ట్రాక్టర్ వేగంగా పక్కకు తిరిగి ట్రక్కు చక్రాలు అతనిపై నుంచి వెళ్లటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య వెంకట లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

యాచకులను ఢీకొట్టిన బైకు

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం గోపాలపట్నంకు చెందిన యువకుడు ఆంజనేయులు మరో యువకునితో బైకుపై కత్తిపూడి వైపు వెళ్తున్నారు. బెండపూడి వద్ద జాతీయ రహదారిపై ఆర్చి జంక్షన్‌కు సమీపానికి వచ్చేసరికి రోడ్డు దాటుతున్న యాచకులను ఢీకొన్నారు. దీంతో బైకు అదుపుతప్పి పడిపోవడంతో ఆంజనేయులకు కాలువిరగడంతోపాటు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ సూర్య, పైలెట్ అప్పారావు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వల్పంగా వచ్చే వరద మంచిదే!

- వంట చేలు, లంక తోటలకు ఎర్ర నీరు
- ఫలాలు, ఉద్యానాలకు మేలు



గోదావరి లంకల్లోని తోటల్లోకి చేరిన వరద నీరు





వరద నీరు (ఎర్ర నీరు) చేరిన చేలల్లో నాట్లు వేస్తున్న కూలీలు, గోదావరి పులసలు

ఐ.పోలవరం: గోదావరికి వరద అంటే ఎవరైనా భయపడతారు. మరీ ముఖ్యంగా కోనసీమ జిల్లా వాసులకు నిద్రాహారాలు ఉండవు. ఉప్పెనలా వచ్చి పడే వరద లంక గ్రామాలను, పంట భూములను ముంచెత్తుతోంది. వందల మంది రైతులకు నష్టాలను మిగులుస్తోంది. వరదల వల్ల లంకవాసులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అయితే స్వల్పంగా వచ్చే వరదకు రైతులు, లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేవారు, మత్స్యకారులు సంబరపడతారంటే అతిశయోక్తి కాదు. గోదావరికి వరద వచ్చి తగ్గుముఖం పట్టింది. అత్యధికంగా ఈ నెల 13వ తేదీన 7.29 లక్షల క్యూసెక్కుల వరద నీరు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేశారు. తరువాత నుంచి వరద క్రమేపీ తగ్గుముఖం పట్టింది. బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో 1,76,676 క్యూసెక్కులకు తగ్గింది. వరద వచ్చి తగ్గుముఖం పట్టడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

మేలు చేసే ఒండ్రు మట్టి

గోదావరి వరదల సమయంలో ఎగువ నుంచి వచ్చే ఎర్రనీరుతోపాటు ఒండ్రుమట్టి కొట్టుకు వస్తుంది. ఇది కాలువల ద్వారా పంట చేలు, తోటలకు చేరుతుంది. ఎగువ కొండ ప్రాంతాలు, అటవీ ప్రాంతాల నుంచి వచ్చే నీరు పలు రకాలుగా మంచిది. కొండల మీద పడే వర్షాల నుంచి వచ్చే నీటిలో మినరల్స్, న్యూట్రినైట్స్ ఉంటాయి. అటవీ ప్రాంతాల నుంచి వచ్చే నీటిలో కూడా వనమూలికలు, హ్యూమస్ (జంతు కళేబరాల అవశేషాల నుంచి వచ్చే కర్బనం), సూక్ష్మ పోషకాలు అధికం. పంట పొలాలు, తోటల్లో నీరు చేరిన తరువాత దానిలో ఉన్న ఒండ్రు అర అడుగు మేర భూమిపై పేరుకుపోతుంది. గోదావరి లంకల్లో అయితే అడుగు మేర ఒండ్రు మట్టి చేరుతుంది. డెల్టా కాలువల నుంచి చేలకు నేరుగా వరద వస్తుంది. గోదావరి నదీపాయల నుంచి విడిపోయే కౌశికలు, అప్పర కౌశికలు, తొగరపాయ, తుల్యభాగ వంటి డ్రెయిన్లలోకి వరద నీరు వచ్చి చేరుతుంది. కొబ్బరి, అరటి, కోకో వంటి ఉద్యాన పంటలకు, డెల్టాలో పంటలకు ఈ నీటిని పెద్ద ఎత్తున తోడడం ద్వారా రైతులు తమ చేలు, తోటలకు ప్రకృతి సిద్ధమైన సూక్ష్మ పోషకాలు, మినరల్స్, న్యూట్రినైట్స్ అందిస్తున్నారు.

పులసలొచ్చేది ఇప్పుడే

మాంసాహార ప్రియులకు నోరూరించే గోదావరి జలపుష్పం పులస చేప దొరికేది కూడా గోదావరికి ఎర్రనీరు వచ్చినప్పుడే. బంగ్లాదేశ్, కోల్‌కతా, ఒడిశా వంటి ప్రాంతాల్లో సముద్రంలో హిల్స్ (విలస) నిత్యం దొరుకుతుంది. ఇటీవల కాలంలో గోదావరి జిల్లాతోపాటు హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల్లో ఏడాది పొడవునా ఈ చేప దొరుకుతూనే ఉంటోంది. స్థానికంగా కూడా సముద్ర వేట సమయంలో విలసలు పెద్ద ఎత్తున దొరుకుతుంటాయి. కాని అసలైన పులస దొరికేది మాత్రం గోదావరికి ఎర్రనీరు తాకినప్పుడే. సాధారణ రోజుల్లో దొరికే విలస చేప కేజీ రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు మాత్రమే ఉంటుంది. అదే గోదావరికి ఎర్రనీరు తాకిన తరువాత దొరికే పులస ఖరీదు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ధర ఉంటుంది. అందుకే గోదావరికి ఎర్రనీరు తగిలి పులస దొరికితే చాలని మత్స్యకారులు ఎదురుతెన్నులు చూస్తున్నారు.

నీటికి ఎదురీదుతూ ఒక్కసారి గోదావరి నీటిలోకి వచ్చిన తరువాత దీని రుచి మారిపోతుంది. ఎర్రనీటిలో వీటిని పట్టుకోవడానికి మత్స్యకారులు పోటీ పడుతుంటారు. ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, టాంజానియా వంటి ప్రాంతాల్లో జీవించే ఈ చేపలు సంతానోత్పత్తి కోసం ఖండాలు దాటి ప్రయాణిస్తాయి. హిందూ మహాసముద్రం మీదుగా బంగాళాఖాతంలోకి ప్రవేశించి అక్కడి నుంచి అంతర్వేది గుండా గోదావరి నది నీటిలోకి చేరతాయి. గోదావరి నది చాలా వేగంగా ప్రవహిస్తుంటుంది. ఆ ప్రవాహాన్ని తట్టుకోవడమే కాకుండా దానికి ఎదురీదుకుంటూ రావడం పులస చేప ప్రత్యేకత. వీటి వలసలు జూన్ నుంచి ఆగస్టు మధ్య ఉంటాయి. గుడ్లు పెట్టి అవి పిల్లలు అయిన తర్వాత అక్టోబర్ మాసానికి చేపలన్నీ తిరిగి సముద్రంలోకి చేరుకుంటాయి. ఇలా గుడ్లను పొదగడానికి వచ్చిన సమయంలో మత్స్యకారుల వలలో పడతాయి ఈ చేపలు. వలలో పడిన వెంటనే పులస చనిపోతుంది. గోదావరి వరద నీటిలోకి వచ్చిన తరువాత దీని రంగు మారుతుంది. దాంతో పాటు గోదావరి తీపి నీటి కారణంగానే వాటి రుచి కూడా మారి పులసగా అవతరిస్తుంది. అయితే గోదావరి అంతటా పులసలు దొరుకుతాయని అనుకోవడం భ్రమే. కేవలం ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి గోదావరి కలిసే ప్రాంతంలో మాత్రమే ఇవి లభిస్తాయి. వీటికి ఇంతటి డిమాండ్ ఉండటానికి ఇది కూడా కారణం.



బొబ్బర్లంక - ముక్తేశ్వరం కాలువలో పరవళ్లు తొక్కుతున్న గోదావరి వరద (ఎర్ర) నీరు

ప్రియురాలిని హత్య చేసి పరారీ

అడ్డు వచ్చిన ఆమె తల్లి, అన్నపై దాడి



పుష్ప మృతదేహం



పుష్ప, షమ్మా (ఫైల్)

రాజోలు: చెడు వ్యసనాలకు బానిసైన యువకుడు తనతో సహజీవనం చేస్తున్న ప్రియురాలిని మద్యం మత్తులో చాకుతో పొడిచి హత్య చేశాడు. బుధవారం రాత్రి బి.సావరం సిద్ధార్థనగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రియురాలిని వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేయగా దానికి ఆమె నిరాకరించింది. దీంతో వారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ప్రియురాలు ఓలేటి పుష్ప(22)ను ప్రియుడు రాజోలు కోళ్ల వారి వీధికి చెందిన షేక్ షమ్మా చాకుతో గుండెల్లో పొడిచాడు. దీంతో పుష్ప ప్రాణాలు కోల్పోయింది. కూతురిని కాపాడుకునేందుకు పుష్ప తల్లి గంగ, పుష్ప అన్న వినయ్ అడ్డువెళ్లగా వారిద్దరిపై కూడా షేక్ షమ్మా చాకుతో దాడి చేసి గాయపర్చాడు. వారి కేకలకు చుట్టుపక్కల వారు రావడంతో నిందితుడు షమ్మా అక్కడి నుంచి పారిపోయాడు. సిద్ధార్థనగర్‌లో జరిగిన హత్య విషయం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్సై రాజేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు దాడిలో గాయపడ్డ తల్లి గంగ, అన్న వినయ్‌లను రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం యెనుముల్లంక గ్రామానికి చెందిన ఓలేటి పుష్పకు ఐదేళ్ల క్రితం రాజోలు మేకలపాలానికి చెందిన ఓలేటి సతీష్‌తో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల బాబు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో పెద్దల సమక్షంలో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తన నాలుగేళ్ల కుమారుడితో పుష్ప, ఆమె తల్లి అంగాని గంగతో కలసి బి.సావరం సిద్ధార్థనగర్‌లో నివాసం ఉంటోంది. రెండేళ్ల క్రితం నుంచి రాజోలు కోళ్లవారి వీధికి చెందిన షమ్మాతో పుష్పకు పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారు సహజీవనం చేస్తున్నారు. మద్యానికి బానిసైన షమ్మా తన అవసరాల కోసం పుష్పను శారీరకంగా, మానసికంగా వేధించేవాడని, డబ్బు కోసం వ్యభిచారం చేయాలని ఒత్తిడి చేస్తున్నాడని పుష్ప తన తల్లి గంగ, అన్న వినయ్‌కు మొర పెట్టుకుంది. ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఎందుకు చెప్పావంటూ పుష్పతో గొడవపడి చాకుతో పొడవడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. తల్లి గంగ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పారిపోయిన షమ్మాను పట్టుకునేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



ముద్దాయిలు, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు, మోటారు సైకిల్‌తో నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్సై రామ్‌కుమార్

సీతానగరం: రఘుదేవపురం రవీంద్ర కాలనీ సురవరపు మణికంఠ ఇంటిలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేశామని నార్త్‌జోన్ డీఎస్పీ వై శ్రీకాంత్ తెలిపారు. గురువారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోరుకొండ సీఐ సత్యకిషోర్, సీతానగరం ఎస్సై డి.రామ్‌కుమార్ సిబ్బందితో కలిసి ముగ్గళ్ళ గోదావరి మాత విగ్రహం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు నీలంశెట్టి వెంకటవాసు (రవీంద్రకాలనీ), రాజానగరానికి చెందిన గొడ్డు భాను శివశంకర్‌లను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. మణికంఠ అక్క శివ కుమారి నిడదవోలులో ఉంటున్నారు. తల్లితో కలిసి మణికంఠ అక్క ఇంటికి వెళ్లి తిరిగి ఈ నెల 12న ఇంటికి వచ్చాడు. తలుపులు తెరచి ఉండటంతో లోపలకి వెళ్లి చూడగా బీరువా లాకర్ బద్దలుకొట్టి ఉంది. అందులోని నాలుగు కాసుల బంగారు, 70 తులాల వెండి, పూజా గదిలో దాచిన రూ.1.50 లక్షల నగదు పోయిందని గుర్తించి ఫిర్యాదు చేశారు. ముద్దాయిల నుంచి మూడు గ్రాముల విలువ ఉన్న ఉంగరం, 750 గ్రాముల వెండి వస్తువులు, రూ.1.50 లక్షల నగదు రికవరీ చేశామని తెలిపారు. దొంగతనానికి ఉపయోగించిన మోటారు సైకిల్ సీజ్ చేశామన్నారు. ముద్దాయిలను రాజమహేంద్రవరం సెవంత్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ (ఏజేఎఫ్‌సీఎం) కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు.



ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడిలో లోకారపు చిన్న అప్పలనాయుడు (79) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రౌతులపూడి గ్రామానికి చెందిన మృతుడు లోకారపు చిన్న అప్పలనాయుడుకు గత 20 ఏళ్లుగా ఆయాసం, కడుపునొప్పి, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. రెండురోజుల క్రితం ఆయాసంగా వుందని చెప్పగా అన్న కొడుకు అయిన లోకారపు దేవుడు స్థానికంగావున్న సీహెచ్‌సీకి తీసుకువెళ్లి జాయిన్ చేశాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ఉదయం ఆరు గంటలకు సిబ్బంది లేచి చూసేసరికి ఆసుపత్రి ఆవరణలోవున్న మామిడి చెట్టుకు ఆతని లుంగీ, టవల్‌తో ఉరి వేసుకుని చెట్టుకింద పడిపోయి మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా ఎస్సై వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలసి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

అయోమయంలో 7వ తరగతి విద్యార్థిని

- గురుకుల పాఠశాలలో సీటు ఇస్తామని పిలిచి ఇప్పుడు తూచ్ అంటున్న ప్రిన్సిపాల్
- ఎస్‌సీ వర్గానికి చెందినదిగా భావించి పొరపాటు పడ్డ సిబ్బంది
- విద్యా సంవత్సరం వృథా అవుతుందన్న ఆందోళనలో కుటుంబ సభ్యులు



సీటు లేదని చెప్పడంతో అయోమయంలో పడ్డ విద్యార్థిని, కుటుంబ సభ్యులు

జగ్గంపేట: స్థానిక గురుకుల పాఠశాలలో సీటు ఇస్తామని పిలిచారని, దీంతో వేరే చోట నుంచి టీసీ, సర్టిఫికెట్లు పట్టుకుని వస్తే సీటు లేదు పొమ్మంటున్నారని గంగవరం మండలం పిడతమామిడి గ్రామానికి చెందిన వాకాడ కుసుమ అర్చన ఆవేదన వెలిబుచ్చింది. జగ్గంపేట గురుకుల పాఠశాలలో సిబ్బంది రిజర్వేషన్ ప్రక్రియను సమగ్రంగా పరిశీలించకుండా వాకాడ కుసుమ అర్చనకు కొద్దిరోజుల క్రితం జగ్గంపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సీటు ఇస్తామని, వచ్చి కలవాలని ఫోన్ చేశారు. దీంతో ఆమె తల్లి వాకాడ వెంకటలక్ష్మితో కలిసి వచ్చి గురుకుల పాఠశాల ప్రస్తుత ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను బుధవారం కలిశారు. అయితే సర్టిఫికెట్లతోపాటు ఎక్కడ చదువుతున్నారో అక్కడ నుంచి టీసీ పట్టుకురావాలని చెప్పడంతో వెళ్లిపోయారు. గోకవరం మండలం మల్లవరంలోని పాఠశాల నుంచి టీసీ, ఇతర సర్టిఫికెట్లు తీసుకుని గురువారం జగ్గంపేటలోని గురుకుల పాఠశాలకు వచ్చారు. అయితే వాకాడ కుసుమ అర్చన బీసీ వర్గానికి చెందినది కావడంతో ఆమెకు సీటు లేదని గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి చెప్పడంతో వారు అవాక్కయ్యారు. ఎస్‌సీ వర్గానికి చెందినదిగా భావించి తమ సిబ్బంది పొరపాటున సమాచారం ఇచ్చారని, బీసీ వర్గానికి సీట్లు లేవని ఆమె చెప్పడంతో వాకాడ కుసుమ అర్చన కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు తమ కుమార్తె విద్యాసంవత్సరం ఏమీ కావాలని వారు ప్రశ్నించారు. అయితే తిరిగి ఎక్కడ చదువుతున్నారో అక్కడికే వెళ్లి జాయిన్ కావాలని కావాలంటే తాము సహకారం అందిస్తామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారని వారు మనస్తాపం వ్యక్తం చేశారు.

డొక్కా సీతమ్మ ఐదో తరం వారసుడు భీముడు మృతి



పి.గన్నవరం: నిరతాన్నదాత్రిగా పేరొందిన డొక్కా సీతమ్మ వారి ఐదోతరం వారసుడు, ఎల్.గన్నవరం గ్రామానికి చెందిన డొక్కా భీమ వెంకట సత్య కామేశ్వరరావు (భీముడు) (59) బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన ఎల్.గన్నవరంలో బ్రాంచి పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంతకాలంగా భీముడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన పార్థివదేహానికి గురువారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

న్యాయం గెలిచింది

తమపై కేసు కొట్టి వేయడంతో వైఎస్సార్ సీపీ నేతల హర్షం

అనపర్తి : అధికారుల విధులకు ఆటంకం కల్పించారంటూ వైఎస్సార్ సీపీ నేతలపై పెట్టిన కేసును కొట్టివేస్తూ అనపర్తి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మజ్జి వంశీకృష్ణ గురువారం తీర్పు వెలువరించారు. ఈ తీర్పు పట్ల వైఎస్సార్ సీపీ శ్రేణులు స్పందిస్తూ న్యాయం గెలిచిందంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళితే 2018లో మహేంద్రవాడ గ్రామంలో స్థానిక గుడిమెట్ల వారి గుడి వీధిలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సంకల్పించి సిమెంటు దిమ్మెను నిర్మించామని పోతంశెట్టి శ్రీను తెలిపారు. ఆ దిమ్మెను అప్పటి అధికార తెలుగుదేశం పార్టీ నేతల ఒత్తిడి మేరకు పంచాయతీ అధికారులు తొలగిస్తుంటే అడ్డుకున్న తనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కొవ్వూరి ధర్మారెడ్డి, కొవ్వూరి జగ్గారెడ్డి, పడాల ధర్మారెడ్డి, మల్లిడి గంగరాజులపై విధులకు ఆటంకం కలిగించారంటూ పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయిందన్నారు. విచారణ అనంతరం ఈ కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్టు శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమ పై అన్యాయంగా మోపిన కేసులో స్థానిక న్యాయవాది మన్మోహన్ శ్రీనివాసరెడ్డి వాదనలు వినిపించారని వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాగా నిందితుల్లో ఒకరైన కొవ్వూరి ధర్మారెడ్డి కేసు నడుస్తుండగానే మృతిచెందారని ఆయన తెలిపారు.

అక్రమంగా ర్యాంపు ఏర్పాటు



ఆత్రేయపురం లంక భూముల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన ర్యాంపు

- ఆత్రేయపురంలో భారీగా మట్టి తవ్వకాలకు ప్రయత్నాలు
- అడ్డుకున్న గ్రామస్తులు



అక్రమంగా ర్యాంపు ఏర్పాటు చేస్తున్న ప్రొక్లెయిన్, దిగుమతి చేస్తున్న కొబ్బరి ఆకులు

కొత్తపేట: ఆత్రేయపురం లంక భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి, తరలించేందుకు టీడీపీ మట్టి మాఫియా పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభించింది. దానిలో భాగంగా భారీ ర్యాంపు ఏర్పాటు చేసింది. ఆత్రేయపురంలో అధికారిక ఇసుక ర్యాంపు ఉంది. కాగా చినపేట సమీపాన సొసైటీ భూములు, శ్మశాన దిబ్బలు ఉన్నాయి. వాటి పక్క నుంచి అక్రమంగా ర్యాంపు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆత్రేయపురంలో టీడీపీ నేత ఆగడాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయింది. అధికార యంత్రాంగం కూడా వారి ఆగడాలకు కొమ్ము కాస్తూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. టీడీపీ అక్రమ వ్యవహారాల్లో భాగంగానే తాజాగా ఆ నాయకుడు ప్రస్తుతం అక్రమ మట్టి తవ్వకాలపై దృష్టి సారించారు. గురువారం యుద్ధప్రాతిపదికన ప్రొక్లెయినర్‌తో పనులు చేపట్టి లంకభూముల్లోకి ర్యాంపును ఏర్పాటు చేస్తూ వెళ్లారు. ట్రాక్టర్లు, లారీల్లో మట్టి తరలింపునకు అనువుగా, అవి దిగబడిపోకుండా కొబ్బరి ఆకులను కూడా ట్రాక్టరుపై తరలించారు. అక్రమంగా ర్యాంపు ఏర్పాటుపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు స్పందించలేదని పలువురు గ్రామస్తులు తెలిపారు. దాంతో గ్రామస్తులే అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ర్యాంపు పనులు నిలిపివేసి యంత్రాలను ఎక్కడివి అక్కడే నిలిపివేశారు. రాత్రి సమయంలో మట్టి రవాణాకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. దీనిపై గ్రామస్తులు ఆందోళనకు సిద్ధం కావడంతో ఎట్టకేలకు సాయంత్రం పోలీసులు రంగప్రవేశం చేసి యంత్రాలను, ట్రాక్టర్లను లంక భూముల్లోంచి బయటకు తీసుకువచ్చారు. దీనిపై రెవెన్యూ, పోలీసు అధికారుల వివరణకు ఫోన్‌లో ప్రయత్నించగా వారు స్పందించలేదు.

పరిశోధనలతో సమాజానికి మేలు



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న జేఎన్టీయూకే వీసీ

కాకినాడ సిటీ: జేఎన్‌టీయూకే ప్రాంగణంలో ఓక్ ఉత్సవాల్లో భాగంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ఇన్ స్వర్ణాంధ్ర అండ్ వికసిత్ భారత్-2047 అనే అంశంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. భారతదేశంలో పూర్వకాలంలో నిర్వహించిన తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల సంస్కృతిని కొనియాడారు. వర్గీస్ కురియన్, స్వామినాథన్, ఎఫ్‌సీ కొహ్లీ వంటి ప్రముఖుల పరిశోధనలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని విశదీకరించారు. వికసిత్ భారత్-2047కు విద్యావ్యవస్థ పటిష్టం కావాలని, స్టార్టప్, స్కిల్, మేకిన్, డిజిటల్, క్లీన్ ఇండియా, క్లీన్ ఆంధ్ర, డిజిటల్ లావాదేవీలు మెరుగుపడాలన్నారు. సౌత్ ఏషియన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ కేకే అగర్వాల్, యూజీసీ మాజీ చైర్మన్, ప్రొఫెసర్ వేద్ ప్రకాష్, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్, యూనివర్సిటీ పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ జానకీరామ్ మాట్లాడారు. రోల్ ఆఫ్ ఇండస్ట్రియలిస్ట్ టూ కొలాబొరేట్ విత్ అకడమిక్ ఇనిస్టిట్యూషన్, టు రియలైజ్ ద అబ్జక్టివ్ ఆఫ్ స్వర్ణాంధ్ర అండ్ వికసిత్ భారత్-2047 అనే అంశంపై ప్యానల్ చర్చలు నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, యూనివర్శిటీ ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్, ఓక్ ఉత్సవ కమిటీ చైర్మన్ పి.ఉదయభాస్కర్ పాల్గొన్నారు.